SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 267 ఎడిటర్ : విక్రం కుమార్ గురువారం 5, జూన్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌లో కొలువులు...



- అణుశక్తి విభాగానికి చెందిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)..197 పోస్టుల నియామకం చేయబోతోంది.

మొత్తం ఖాళీల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 76, ఈడబ్ల్యూఎస్‌లకు 22, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 59, ఎస్సీలకు 13, ఎస్టీలకు 27 కేటాయించారు. స్టైపెండరీ ట్రెయినీస్/ సైంటిఫిక్ అసిస్టెంట్ 11, స్టైపెండరీ ట్రెయినీస్/ టెక్నీషియన్ 166, అసిస్టెంట్ గ్రేడ్ 1 (హెచ్ఆర్) 9, అసిస్టెంట్ గ్రేడ్ 1 (ఎఫ్అండ్ఏ) 6, అసిస్టెంట్ గ్రేడ్ 1 (సీఅండ్ఎంఎం) 5 పోస్టులు ఉన్నాయి.

**అర్హతలు**

స్టైపెండరీ ట్రెయినీస్/ సైంటిఫిక్ అసిస్టెంట్: మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ కెమికల్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిప్లొమాలో 60 శాతం మార్కులు. స్టైపెండరీ ట్రెయినీస్/ సైంటిఫిక్ అసిస్టెంట్: సైన్స్ గ్రాడ్యుయేట్స్.. ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/

తరువాయి 2లో



## ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్యపెరుగుతున్న దూరం

- అమెరికా అధ్యక్షుడి నూతన బిల్లును దుయ్యబట్టిన టెస్లా అధినేత

**జూన్ 4, సమయం న్యూస్** : వాషింగ్టన్: ధనికులకు, కంపెనీలకు 4.5 లక్షల కోట్ల డాలర్ల మేరకు భారీగా పన్నులు తగ్గించి, సంక్షేమ వ్యయానికి కోత పెడుతున్న డోనాల్డ్ ట్రంప్ 'అందమైన భారీ బిల్లును' హేయమైన, అసహ్యకర బిల్లుగా పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ తూర్పారబట్టారు. పాలక రిపబ్లికన్ పార్టీకి తన విమర్శ రుచించదని తెలిసీ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మస్క్ బిల్లును విమర్శించారు. దీనివల్ల పాలక పార్టీలో, ట్రంప్ దగ్గర ఆయన పలుకుబడి తగ్గవచ్చు. అమెరికా కాంగ్రెస్ దిగువ సభ ఆమోదం పొందిన ఈ బిల్లు ప్రస్తుతం ఎగువ సభ సెనెట్ పరిశీలనలో ఉంది.

తరువాయి 2లో

## 2027 ఫిబ్రవరిలో జన, కులగణన



- అదే నెలలో పూర్తి చేయాలని నిర్ణయం
- తొలి దశలో 2026లోనే హౌస్ లిస్టింగ్
- రెండో దశలో జనాభా లెక్కల సేకరణ
- మంచు ప్రభావిత ప్రాంతాల్లో అంతకు ముందే..
- ఈ నెల 16న గెజిట్ నోటిఫికేషన్
- కేంద్ర హోంశాఖ ప్రకటన
- రూ.13,000 కోట్ల వ్యయ అంచనా
- జన గణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన!

**జూన్ 4, సమయం న్యూస్, ఢిల్లీ:** దేశ 16వ జన గణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటే కుల గణననూ చేపట్టి అదే నెల చివరి నాటికి పూర్తి చేయనుంది. ఇందుకోసం 2027 మార్చి 1ని రెఫరెన్స్ తేదీగా నిర్ణయించింది. అంటే ముందు రోజైన ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి 12 గంటలకల్లా జన గణన పూర్తి కానుంది. అంతకుముందే 2026 ఏప్రిల్‌లోనే తొలి విడత హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. మంచు ప్రభావిత ప్రాంతాలైన

తరువాయి 2లో

## సందేహాలు తీర్చేందుకు 'భూ మిత్ర'

- భూభారతి పోర్టల్‌లో నాలుగు భాషల్లో చాట్‌బాట్

**జూన్ 4, సమయం న్యూస్, హైదరాబాద్:** భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 'భూ భారతి' పోర్టల్‌లో దరఖాస్తుదారుల సందేహాలు తీర్చేందుకు 'భూ మిత్ర' చాట్‌బాట్‌ను చేర్చారు. నాలుగు భాషల్లో సమాధానాలు చెప్పే ఈ చాట్‌బాట్‌ను ట్రిపుల్ ఐటీ

తరువాయి 2లో




## నెలనెలా యూరియా కోత

- ఏప్రిల్‌లో 48 వేలు, మేలో 66 వేల టన్నులు తగ్గించిన కేంద్రం
- జూన్‌లో ఇప్పటికి వచ్చింది 3 టన్నులే
- వర్షా కాలం పంటల సీజన్‌పై ప్రభావం!
- దిల్లీ వెళ్లి వివరించాలని సంచాలకునికి మంత్రి తుమ్మల ఆదేశాలు

**జూన్ 4, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో వానా కాలం సీజన్‌కు యూరియా సమీకరణ సమస్యగా మారనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా నిర్ణీత కేటాయింపుల మేరకు సరఫరా చేయడం లేదు. ఏప్రిల్, మే మాసాల కోటాలో భారీగా కోత విధించగా.. ఈ నెలలోనూ అదే పరిస్థితి కనిపిస్తుండటంతో వ్యవసాయ శాఖ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ రాష్ట్రాలకు నెలవారీ ప్రణాళిక మేరకు యూరియాను పంపిస్తుంది. ప్రస్తుత వానాకాలం సీజన్ కోసం తెలంగాణకు 9.80 లక్షల టన్నులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం సీజన్ ఆరంభానికి




ముందే 5 లక్షల టన్నులు నిల్వ చేసి డిమాండుకు తగ్గట్లుగా మార్క్‌ఫెడ్ ద్వారా పంపిణీకి ప్రణాళిక చేసింది. కేంద్రం నిర్దేశించిన విధంగా ఏప్రిల్‌లో రాష్ట్రానికి 1.70 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 1.22 లక్షల టన్నులే పంపారు. తరువాతి నెలలో సర్దుబాటు చేస్తారని

తరువాయి 2లో

## ఒకనాటి బాలకార్మికుడే.. దేశాధ్యక్షుడు

- దక్షిణ కొరియా నూతన సారథి లీ జే-మ్యుంగ్ ప్రస్థానం
- తండ్రేమో మార్కెట్‌లో పారిశుద్ధ్య కార్మికుడు
- తల్లేమో పబ్లిక్ టాయిలెట్లలో అటెండర్
- ఫ్యాక్టరీల్లోనే గడిచిన బాల్యం
- మానవ హక్కుల న్యాయవాదిగా పేరు
- కష్టాలను, ఆర్థిక అసమానతలను అధిగమించి దక్షిణ కొరియా అధ్యక్ష స్థానానికి ఎదిగిన లీ

2లో



## సంబరం చిన్నబోయింది..



చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ఆటగాళ్లు

- తొక్కిసలాట ఘటనతో బెంగళూరులో విషాదం
- ఆర్సీబీ విజయోత్సవాలకు కత్తెర

18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ ఎట్టకేలకు ఐపీఎల్ ట్రోఫీని సాధించింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. కప్పు ఆర్సీబీ సొంతమైన క్షణం నుంచి బెంగళూరులో సంబరాలు మిన్నంటాయి. రాత్రంతా ఆ నగరం నిద్రపోలేదు. తర్వాతి రోజు ఆర్సీబీ ఆటగాళ్లు సొంతగడ్డకు వస్తుండడంతో విజయోత్సవాలు ఇంకా గొప్పగా చేసుకోవాలనుకున్నారు అభిమానులు. అందుకు ఏర్పాట్లు కూడా ఘనంగానే జరిగాయి. కానీ చిన్నస్వామి స్టేడియం దగ్గర తొక్కిసలాట వల్ల 11 మంది చనిపోయి తీవ్ర విషాదం నెలకొనడంతో సంబరాలు చిన్నబోయాయి. ఈ ఘటన తర్వాత కూడా స్టేడియంలో విజయోత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు కానీ.. విషాదం కారణంగా అది కళ తప్పింది.

తరువాయి 2లో

## 1 ఏడాదిలోనే అమరావతి పరుగులు

- వేగం పుంజుకున్న రాజధాని నిర్మాణం
- ఇప్పటికే రూ.50వేల కోట్లకుపైగా పనులకు టెండర్లు ఖరారు

**జూన్ 4, సమయం న్యూస్, అమరావతి:** రాజధానిలో నిర్మాణ పనుల పురోగతిని 'ఈనాడు' బృందం తాజాగా పరిశీలించింది. చాలా పనులు మొదలై, వేగంగా జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. వారికోసం నిర్మాణ సంస్థలు నివాస ప్రాంతాల్ని ఏర్పాటుచేశాయి.

తరువాయి 2లో



## నెలనెలా యూరియా కోత

(మొదటిపేజీ తరువాయి)

* రాష్ట్ర వ్యవసాయాధికారులు భావించారు.
* కానీ.. మే నెలలో రావాల్సిన 1.60 లక్షల టన్నుల కోటాలోనూ కోతపెట్టి 94 వేల టన్నులే రవాణా చేశారు.
* ఏప్రిల్‌లో 48 వేల టన్నులు, మే నెలలో 66 వేల టన్నులు.. మొత్తంగా ఈ రెండు మాసాల కోటాలో 1.14 లక్షల టన్నులు కోత పెట్టారు.
* జూన్ కేటాయింపులతోనైనా ఆ మేరకు భర్తీ చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. మే 19న వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు దిల్లీ వెళ్లి అభ్యర్థించారు. 26న వ్యవసాయశాఖ కూడా లేఖ రాసింది.
* అయినా జూన్ నెల కోటా కింద 1.70 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా బుధవారం వరకు 3 టన్నులే వచ్చింది.
* దీంతో మంత్రి తుమ్మల దీనిపై సమీక్ష నిర్వహించారు. కేంద్రం వైఖరితో యూరియా కొరత తీవ్రస్థాయిలో తలెత్తే ప్రమాదం ఉందని. వెంటనే దిల్లీకి వెళ్లి కేంద్ర ఎరువుల శాఖ ఉన్నతాధికారులకు సమస్యను వివరించాలని వ్యవసాయ సంచాలకుడు గోపిని ఆదేశించారు.

## సందేహాలు తీర్చేందుకు ‘భూ మిత్ర’

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ప్రాజెక్ట్స్ ల్యాబ్ పరిశోధకులు రెండు నెలల్లోనే రూపొందించారు. భూములు కొనడం, అమ్మడానికి సంబంధించిన సందేహాలను టైప్ చేస్తే తెరపై సమాధానం చూపిస్తుంది. త్వరలో ఆడియో సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తేనున్నట్లు ప్రాజెక్ట్స్ ల్యాబ్ అధినేత వై.ప్రకాశ్ వెల్లడించారు.

**రెవెన్యూ అధికారుల ద్వారా తెలుసుకుని..**

ప్రభుత్వం భూభారతి పోర్టల్‌లో అన్ని సౌకర్యాలు ఉండాలన్న లక్ష్యంతో అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని, శక్తిమంతమైన ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేసింది. రెండు నెలల కిందట ఈ పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా కొన్ని మండలాల్లో ప్రవేశపెట్టినప్పుడు సందేహాలు తీర్చుకునే అవకాశం లేదని గుర్తించింది. దీని కోసం ఓ చాట్‌బాట్ ఉండాలని రెవెన్యూ అధికారులు భావించారు. ఈ మేరకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని ప్రాజెక్ట్స్ ల్యాబ్ ప్రతినిధులను సంప్రదించగా.. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసేందుకు అంగీకరించారు. భూముల వివరాలు, రిజిస్ట్రేషన్ అంశాలు, సర్వే నంబర్లు, నిషేధిత భూముల జాబితా తదితర అంశాలన్నింటినీ రెవెన్యూ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. వీటికి ఒక సాఫ్ట్‌వేర్ తయారుచేశారు. భూభారతిని పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్న గ్రామాలకు వెళ్లి రైతులు, అధికారులతోపాటు కృత్రిమమేధ ద్వారా సందేహాలను సేకరించారు. తొలుత తయారుచేసిన సాఫ్ట్‌వేర్‌తో వాటి వివరాలను కలిపి అప్లైడ్ రీసెర్చ్ ఇంజినీర్ అఖిల శ్రీమానస చాట్‌బాట్‌ను రూపొందించారు.

## 2027 ఫిబ్రవరిలో జన, కులగణన

(మొదటిపేజీ తరువాయి)

లద్ధాఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 సెప్టెంబరు ఆఖరు నాటికే జన గణన పూర్తి కానుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబరు 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించింది. జనాభా లెక్కల చట్టం1948లోని (సెన్సస్ యాక్ట్1948) సెక్షన్ 3 నిబంధనల ప్రకారం.. ఈ వివరాలను ఈ నెల 16న అధికారిక గెజిట్‌లో ప్రచురించనున్నట్లు కేంద్ర హోంశాఖ బుధవారం వెల్లడించింది. వాస్తవానికి 2021లోనే జన గణన జరగాల్సి ఉంది. కొవిడ్ మహమ్మారి కారణంగా అది వాయిదా పడింది. ఇన్నాళ్లకు మళ్లీ కొత్త షెడ్యూలు వచ్చింది. పదహారు ఏళ్ల తర్వాత జన గణన జరగనుంది. ఇదివరకు కేవలం జనాభా లెక్కలు, ఎస్సీ, ఎస్టీ కులాల వివరాల సేకరణకే ప్రభుత్వం పరిమితమైంది. ఇప్పుడు తొలిసారిగా ఓబీసీ కులాల వివరాలనూ ప్రత్యేకంగా సేకరించనుంది. కుల గణనకు ఏప్రిల్ 30వ తేదీన జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

* జనాభా లెక్కలతోపాటే జాతీయ జనాభా రిజిస్టరును (ఎన్‌పీఆర్) అప్‌డేట్ చేస్తారా లేదా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. 2020లో జన గణన సమయంలో మాత్రం ఎన్‌పీఆర్ అప్‌డేట్ వెంటనే జరుగుతుందని పేర్కొంది. కానీ కొవిడ్‌తో జన గణనే జరగలేదు.
* 2027లో జన గణనకు రూ.13,000 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. 2021లో చేపట్టాలనుకున్న జన గణనకు 2019 డిసెంబరు 24న జరిగిన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జన గణనకు రూ.8,754 కోట్లు, ఎన్‌పీఆర్ అప్‌డేట్‌కు రూ.3,941 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది.
* జన గణన రిజిస్ట్రార్ జనరల్‌కు కేంద్ర ప్రభుత్వం.. 202526 బడ్జెట్‌లో కేవలం రూ.574 కోట్లే కేటాయించింది. అయితే జనాభా లెక్కల సేకరణకు నిధుల కేటాయింపు పెద్ద సమస్య కాదని అధికారులు అంటున్నారు.
* దాదాపు 30 లక్షల మంది సిబ్బంది ఈ జన గణనలో పాలుపంచుకుంటారు.
* 2011 జనాభా లెక్కల ప్రకారం.. దేశ జనాభా 121.01 కోట్లు. ఇందులో 62.3 కోట్ల మంది (51.54%) పురుషులు. 58.6 కోట్ల మంది (48.46%) మహిళలు.
* బ్రిటిష్ హయాంలో 1881 నుంచి 1931 వరకూ కుల గణన జరిగింది. ఆ తర్వాత 2011లో యూపీఏ హయాంలో సామాజిక, ఆర్థిక, కుల గణన జరిగింది. అయితే ఆ వివరాలను ప్రభుత్వం బయటపెట్టలేదు.
* తెలంగాణ, బిహార్‌లు సొంతంగా కుల గణన ఇప్పటికే నిర్వహించాయి. అయితే కేంద్రం ఈ రాష్ట్రాల్లోనూ మళ్లీ నిర్వహించనుంది..

## ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్యపెరుగుతున్న దూరం

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటు రెండు సభల ఆమోదం పొందిన తరవాత ట్రంప్ బిల్లు విద్యుత్ వాహనాలకు, హరిత ఇంధనాలకూ నిధులను తగ్గించేస్తుంది. ఇది అమెరికాలో అతిపెద్ద విద్యుత్ వాహన ఉత్పత్తిదారైన టెస్లా కంపెనీకీ, దాని యజమాని మస్క్‌కూ తీరని నష్టం కలిగించకమానదు. ఇప్పటికే 36 లక్షల కోట్ల డాలర్లకు చేరిన అమెరికా ప్రభుత్వ రుణభారాన్ని తగ్గించడానికి ఈ బిల్లు పేదల ఆరోగ్య బీమా మెడికెయిడ్‌కూ, ఆహార టోకెన్లకూ కోతపెడుతోంది. ప్రపంచంలో అత్యంత ధనికుడైన ఎలాన్ మస్క్ నిరుడు దేశాధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక కావడానికి 25 కోట్ల డాలర్లను వెచ్చించారు.

## న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌లో కొలువులు

(మొదటిపేజీ తరువాయి)

స్టాటిస్టిక్స్/ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్‌లతో బీఎస్సీలో 60 శాతం మార్కులు కావాలి. స్టైపెండరీ ట్రెయినీస్/ టెక్నీషియన్‌ప్లాంట్ ఆపరేటర్: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు.

స్టైపెండరీ ట్రెయినీస్/ టెక్నీషియన్‌మెయింటెయినర్: పదోతరగతిలో 50 శాతం మార్కులు. ఫిట్టర్/ ఎలక్ట్రీషియన్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ వెల్డర్/ మెషినిస్ట్/ ఏసీ మెకానిక్/ డీజిల్ మెకానిక్ బ్రాంచ్‌తో రెండేళ్ల ఐటీఐ కోర్సు పూర్తిచేయాలి. అసిస్టెంట్ గ్రేడ్1 (హెచ్‌ఆర్), (ఎఫ్ అండ్ ఏ), సీ అండ్ ఎంఎం: ఏదైనా డిగ్రీలో 50 శాతం మార్కులు అవసరం. వయసు: సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 25 ఏళ్లు, టెక్నీషియన్‌కు 24 సంవత్సరాలు, అసిస్టెంట్ గ్రేడ్‌కు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది. దరఖాస్తు ఫీజు: సైంటిఫిక్ అసిస్టెంట్, ట్రెయినీలకు రూ.150. అసిస్టెంట్ గ్రేడ్1కు రూ.100. ఎస్సీ/ ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, సంస్థ ఉద్యోగులకు ఫీజు లేదు.

# 2025: సంబరం చిన్నబోయింది

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలిసారి ఐపీఎల్ విజేతగా నిలిచిన నేపథ్యంలో పెద్ద ఎత్తున సంబరాలకు సిద్ధమైన ఆ జట్టు అభిమానులకు చేదు అనుభవం తప్పలేదు. బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ఆటగాళ్లను కర్ణాటక క్రికెట్ సంఘం ఘనంగా సన్మానించాలని, అంతకంటే ముందు నగరంలో విజయోత్సవ ర్యాలీ కూడా చేయాలని భావించగా.. అంతలోనే విషాదం చోటు చేసుకుంది. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో విధాన సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, గవర్నర్ తావర్ చంద్‌లను కలిసిన అనంతరం, సాయంత్రం 6.10 గంటలకు ఆర్సీబీ జట్టు చిన్నస్వామి స్టేడియాన్ని చేరుకుంది. అంతకు రెండు గంటల ముందే తొక్కిసలాట జరిగి విషాదం నెలకొంది. దీంతో సన్మాన కార్యక్రమాన్ని ఆపేస్తారేమో అనుకున్నారు. కానీ కార్యక్రమం యధావిధిగా సాగింది. కొన్ని గంటల పాటు ఘనంగా చేయాలనుకున్న కార్యక్రమాన్ని 20 నిమిషాల్లో మామూలుగా ముగించారు. మెరుగైన ప్రణాళికతో చేయాల్సింది.. సైకియా: ఐపీఎల్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ వేడుకల్లో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నాడు. వేడుకల్ని మరింత మెరుగ్గా ప్రణాళిక చేసుకోవాల్సిందని సైకియా అభిప్రాయపడ్డాడు. ‘‘ఇది చాలా దురదృష్టకరం. ప్రజాదరణ విషయంలో ప్రతికూల కోణం ఇది. తమ ఆరాధ్య క్రికెటర్లు అంటే అభిమానులకు పిచ్చి. నిర్వాహకులు మరింత మెరుగ్గా ప్రణాళిక చేసుకోవాల్సింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వాళ్లు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ఇంత పెద్ద స్థాయిలో విజయోత్సవ వేడుకలు నిర్వహించేటప్పుడు సరైన జాగ్రత్తలు, భద్రత చర్యలు తీసుకోవాలి. ఎక్కడో కొన్ని లోపాలు ఉన్నాయి. ఐపీఎల్‌కు ఇంత గొప్ప ముగింపు తర్వాత ప్రతికూల క్లైమాక్స్ ఇది. గతంలోనూ ఐపీఎల్ ట్రోఫీ సంబరాలు జరిగాయి. గత ఏడాది కేకేఆర్ విజయోత్సవాలు నిర్వహించినా.. కోల్‌కతాలో ఏమీ జరగలేదు. టీ20 ప్రపంచకప్ గెలిచాక ముంబయిలో జనసంద్రాన్ని చూశాం. అప్పుడు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఫైనల్ సందర్భంగా స్టేడియంలో 1.20 లక్షల మంది ఉన్నారు. స్థానిక అధికారులతో కలిసి బీసీసీఐ బృందం అంతా సాఫీగా జరిగేలా చూసుకుంది. ఆర్సీబీ అభిమానుల భావోద్వేగాలను కూడా మనం అర్థం చేసుకోవాలి. వాళ్లు 18 ఏళ్లుగా కప్పు కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి వేడుకలు నిర్వహించినపుడు అందరం కలసికట్టుగా బాధ్యతలను పంచుకోవాలి’’ సైకియా అన్నాడు.

**ఇది మీ కోసమే... కోహ్లి**

ఆర్సీబీ సాధించిన ఐపీఎల్ ట్రోఫీ అభిమానుల కోసమే అని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అన్నాడు. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కోహ్లి మాట్లాడుతూ.. ‘‘మన కెప్టెన్ నిన్న బహుమతి ప్రదానోత్సవంలో అన్న మాటనే పునరావృతం చేస్తున్నా. ఇక ‘ఈ సల కప్ నమ్‌దే’ కాదు.. ‘ఈ సల కప్ నమ్దు’. ఇదంతా మీ కోసమే. ఈ అద్భుతమైన నగరానికి చెందిన అభిమానులు ప్రతి సందర్భంలో మాకు తోడున్నారు. ప్రపంచంలో మరే జట్టుకూ ఇలాంటి అభిమానగణం ఉండదేమో. మన కెప్టెన్‌కు గట్టిగా అభినందనలు చెప్పాలనుకుంటున్నా’’ అని పేర్కొన్నాడు. అనంతరం ఆర్సీబీ సారథి రజత్ పాటీదార్ మాట్లాడుతూ.. ‘‘నేను ఇక్కడికి ఎప్పుడు వచ్చినా ‘నమస్కార బెంగళూరు’ అని మొదలుపెడతా. ఇది మాకు గొప్ప సందర్భం. సీజన్ ఆరంభం నుంచి ఎవరేం చేయాలో పూర్తి స్పష్టతతో ఉన్నాం. మీరందరూ ట్రోఫీకి అర్హులు. మిమ్మల్ని మేమందరం ఎంతగానో ప్రేమిస్తాం’’ అని అభిమానులను ఉద్దేశించి అన్నాడు.

**ఆ ఘటనలో 16 మంది..**

ఆర్సీబీ ఐపీఎల్ విజయోత్సవ సంబరాలు చూడడానికి వచ్చిన అభిమానుల మధ్య తొక్కిసలాట జరిగి 11 మంది చనిపోయిన ఘటన బెంగళూరులో పెను విషాదాన్ని నింపింది. దేశంలో ఇలాంటి క్రీడా సంబంధిత విషాదం చోటు చేసుకోవడం ఇది తొలిసారి కాదు. 1980 ఆగస్టు 16న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో 16 మంది అభిమానులు చనిపోవడం భారత క్రీడా చరిత్రలోనే అతి పెద్ద విషాదాల్లో ఒకటి. అప్పుడు మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా ఇరు జట్ల అభిమానుల మధ్య ఘర్షణ జరిగి 16 మంది ప్రాణాలు కోల్పోయారు. పరస్పరం అభిమానులు రాళ్లు రువ్వుకోవడం, దాడి చేసుకోవడంతో పలువురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వందల మంది గాయపడ్డారు. ఇక 1969లో ఇదే ఈడెన్ గార్డెన్స్ మైదానం బయట మరో విషాదం చోటు చేసుకుంది. భారత్‌ఆస్ట్రేలియా టెస్టు మ్యాచ్ టికెట్ల కోసం పెద్ద ఎత్తున అభిమానులు రావడం, పరిస్థితి అదుపు తప్పి తొక్కిసలాట చోటు చేసుకోవడంతో ఆరుగురు చనిపోయారు. వందమందికి పైగా గాయపడ్డారు. 2022లోని హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో భారత్‌ఆస్ట్రేలియా టీ20 మ్యాచ్ టికెట్ల కోసం అభిమానులు ఎగబడడంతో తొక్కిసలాట జరిగి విషాదానికి దారి తీసేలా కనిపించింది. అయితే ఆ ఘటనలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదు. ఇద్దరు పోలీసులతో పాటు ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

**సమాచారం లేదు..: ధూమల్**

ఆర్సీబీ గెలుపు సంబరాల గురించి తమకు సమాచారం లేదని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్ తెలిపాడు. ‘‘దీనిపై విచారణ జరగాల్సి ఉంది. సంబంధిత అధికారులు ఆ పని చూసుకుంటారు. అది బీసీసీఐ కార్యక్రమం కాదు. ఇలా జరగడం బాధాకరం. వేడుకలు విషాదంగా మారాయి. అది ప్రణాళిక ప్రకారం జరిగిన కార్యక్రమమా, కాదా అన్నదానిపై నాకు సమాచారం లేదు. నేను ఆర్సీబీ ప్రతినిధులకు ఫోన్ చేస్తే స్టేడియంలో వేడుకల తాలూకు శబ్దాలు వినిపించాయి. వాళ్లకు బయట ఏం జరుగుతోందో తెలియలేదనుకుంటా. త్వరగా వేడుకలను ముగించాలని మాత్రం చెప్పాను. గత నెలలో అత్యవసర పరిస్థితుల్లో ధర్మశాలలో మ్యాచ్ ఆపి అభిమానులను తరలించాం. ఒక్కరు కూడా గాయపడలేదు’’ అని ధూమల్ చెప్పాడు.

# ఒకనాటి బాలకార్మికుడే.. దేశాధ్యక్షుడు

అధ్యక్ష ఎన్నికల్లో లీ జేమ్యుంగ్ నెగ్గడంతో దక్షిణ కొరియాలో దాదాపు ఆరు నెలలుగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడిందనే చెప్పాలి. గత అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ డిసెంబరులో అత్యయిక పరిస్థితి విధించాలన్న నిర్ణయం తీసుకోవడంతో ఆ దేశం రాజకీయ సంక్షోభంలో చిక్కుకొంది. అనంతర పరిణామాల్లో యూన్‌పై పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దాన్ని ధ్రువీకరించడానికి రాజ్యాంగ న్యాయస్థానం సమయం తీసుకోవడంతో ఎన్నికల ప్రక్రియ కాస్త ఆలస్యమైనా, అంతిమంగా దక్షిణ కొరియా ప్రజలు బలమైన తీర్పునే ఇచ్చారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన 61 ఏళ్ల లీని గెలిపించి, అధికార పీపుల్స్ పవర్ పార్టీకి చెందిన కిమ్ మూన్ సూను ఓడించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే శక్తులకు తాము మద్దతివ్వబోమన్న సంకేతాన్నిచ్చారు.

**పనిచేస్తూ..చదువుతూ..**

లీ జేమ్యుంగ్ 1963లో నిరుపేద కుటుంబంలో జన్మించారు. బాలకార్మికుడిగా పనిచేస్తూనే చదువును కొనసాగించారు. 1982లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1986లో బార్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులై లాయరుగా ప్రాక్టీసు ప్రారంభించారు. పేదలు, కార్మికుల పక్షాన ఎక్కువ కేసులు పోరాడిన ఆయనకు మానవ హక్కుల న్యాయవాదిగా మంచి పేరుంది. 2005లో లీ రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆరంభంలో ఎదురుదెబ్బలు తిన్నా తర్వాత కాలంలో మేయర్‌గా, గవర్నర్‌గా ఎన్నికై పాలనలో తన సత్తా నిరూపించుకున్నారు. 2022 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి.. కేవలం 0.73 శాతం ఓట్లతోనే పీపుల్స్ పవర్ పార్టీ అభ్యర్థి యూన్ సుక్ యోల్ చేతిలో లీ ఓడిపోయారు.

**కడిగిన ముత్యం కాదు**

లీపై పలు కేసులు ఉన్నాయి. కొన్నింటిలో అభియోగాలు తీవ్రమైనవి. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న సమయంలోనే ఆయన కేసులపై విచారణను కోర్టులు నిలిపివేశాయి. పదవిలో ఉన్నంతకాలం ఈ కేసులు ముందుకు కదలకపోవచ్చు. ఈ విషయంలో దక్షిణ కొరియా అధ్యక్షుడికి చట్టపరంగానూ మినహాయింపు ఉంది. లీపై 2024లో హత్యాయత్నం కూడా జరిగింది. ఆటోగ్రాఫ్ అడుగుతూ ఓ వ్యక్తి ఆయన మెడపై బలమైన గాయం చేశాడు. దాదాపు రెండు గంటలు వైద్యులు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. తాగి వాహనం నడిపిన కేసు కూడా లీపై నమోదైంది. 2018లో వివాహేతర సంబంధం ఉందన్న ఆరోపణలూ ఆయనపై వచ్చాయి. 2022కు సంబంధించిన ఎన్నికల కేసులో కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. తర్వాత అప్పీల్‌కోర్టు ఆయన్ను నిర్దోషిగా ప్రకటించినా.. ఆ తీర్పును సుప్రీంకోర్టు తిరస్కరించింది.

**ఉత్తర కొరియాతో దోస్తీ!**

రెండు కొరియాలు కలవాలన్న బలీయమైన ఆకాంక్ష ఉన్న వ్యక్తి లీ జే మ్యుంగ్. ఉత్తరకొరియాతో స్నేహసంబంధాలు కొనసాగించాలన్నది ఆయన విధానం. యూన్ సోక్ యోల్ నేతృత్వంలోని గత ప్రభుత్వం అనుసరించిన వైఖరికి ఇది పూర్తిగా వ్యతిరేకం. ఈ విషయంలో లీకి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయనే చెప్పాలి. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉండటం కలిసొచ్చే అంశం. ట్రంప్ తొలిసారి అధ్యక్ష పదవిలోకి వచ్చినపుడు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరిపారు. కాబట్టి లీ విధానానికి అగ్రరాజ్యం నుంచి పెద్దగా అభ్యంతరాలు వ్యక్తంకాకపోవచ్చు. అయితే అమెరికా విధించిన ఆర్థిక సుంకాలు దక్షిణకొరియాను రానున్న రోజుల్లో తీవ్ర సంక్షోభంలోకి నెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లీ అధ్యక్ష ప్రయాణం నల్లేరుపై నడక మాత్రం కాదంటున్నారు విశ్లేషకులు.

# 1 ఏడాదిలోనే అమరావతి పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

* రూ.930 కోట్లతో చేపట్టిన హ్యాపీనెస్ట్ పనులు ప్రారంభమయ్యాయి. పైల్స్ ఫౌండేషన్ వేయడం పూర్తయింది. నేలపాడు వద్ద 12 టవర్లలో మొత్తం 1,200 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు.
* ప్రముఖ విద్యాసంస్థలు అమరావతికి క్యూ కడుతున్నాయి. బిట్స్, ఎక్స్ఎల్ఆర్ఐ, నేషనల్ లా యూనివర్సిటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలకు ప్రభుత్వం స్థలం కేటాయించింది.
* దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ విలేజ్ ఏర్పాటుకు 50 ఎకరాలు కేటాయించింది.
* తుళ్లూరులో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ప్రధాన బ్లాక్ పనులు చివరిదశకు వచ్చాయి. మన రాష్ట్ర పోలీసులకే కాకుండా.. ఇతర రాష్ట్రాల పోలీసులకూ ఉపయోగపడేలా దీన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారు.
* కాజ నుంచి గొల్లపూడి మీదుగా చిన అవుటపల్లి వరకు విజయవాడ బైపాస్ రహదారి సెప్టెంబరుకల్లా అందుబాటులోకి వస్తుంది.

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టును 189.4 కి.మీ. పొడవున ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్డ్ రహదారిగా చేపట్టేందుకు కేంద్రం అంగీకరించింది. భూసమీకరణ వ్యయాన్నీ కేంద్రమే భరించనుంది.

రాజధాని నిర్మాణం మళ్లీ పరుగందుకుంది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పూర్తిస్థాయిలో పట్టాలెక్కింది. రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం, రహదారులు, కాలువల అభివృద్ధి, రిజర్వాయర్ల నిర్మాణం వంటి ప్రధాన మౌలిక వసతులు, రైతులకు స్థలాలిచ్చిన లేఔట్ల అభివృద్ధికి రూ.64,000 కోట్లతో అంచనాలు రూపొందించి... రూ.50వేల కోట్లకుపైగా పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేశారు. 8వేల మంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. ఈ పనులన్నీ మూడేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం... భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎయిర్‌పోర్ట్, స్పోర్ట్స్ సిటీ వంటి నిర్మాణాల కోసం మలిదశలో 45వేల ఎకరాల భూసమీకరణకు సిద్ధమైంది.

* **నేలపాడులో భారీ యంత్రాలతో చేపట్టిన హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులు**

**కారుమబ్బులు తొలగిన వేళ..**

వైకాపా ప్రభుత్వం అమరావతిపై కక్షగట్టి విధ్వంసానికి పూనుకుంది. ఐదేళ్లలో ఒక్క ఇటుక రాయి వేయకపోగా.. ‘అమరావతి బ్రాండ్ ఇమేజ్’ని తీవ్రంగా దెబ్బతీసింది. 2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడడంతోనే కారుమబ్బులు తొలగిపోయాయి. జూన్ 12న పాలనా పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం... అమరావతిని తొలి ప్రాధాన్యంగా ఎంచుకుని పునర్నిర్మాణానికి నడుం కట్టింది. వైకాపా సృష్టించిన ఆర్థిక, న్యాయపరమైన అవరోధాలు, గుత్తేదారులకు బకాయిల్లాంటి అవరోధాలను వేగంగా అధిగమించింది. ఇదే వేగంతో పనులు జరిగితే... ఐదు కోట్ల మంది ఆంధ్రుల కల త్వరలోనే సాకారమవుతుంది.

* **అడ్డంకులు తొలగించేందుకే 8 నెలలు**

వైకాపా ప్రభుత్వం సృష్టించిన అడ్డంకులు, వేసిన చిక్కుముళ్లు తొలగించేందుకే కూటమి ప్రభుత్వానికి మొదటి ఎనిమిది నెలలు సరిపోయింది. రాజధాని పనుల్ని నిలిపేసిన వైకాపా ప్రభుత్వం.. గుత్తేదారులు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు సరికదా, బ్యాంక్ గ్యారంటీలూ తిరిగి ఇవ్వలేదు. వారితో కాంట్రాక్టులు రద్దుచేయలేదు. ఇప్పుడు పాత ఎస్ఎస్ఆర్ ధరలకు పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో... కూటమి ప్రభుత్వం వారితో కాంట్రాక్టులను రద్దుచేసి, దానికి అసెంబ్లీ ఆమోదం పొందింది. న్యాయసమీక్ష, రివర్స్ టెండరింగ్ లాంటి వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల్ని రద్దుచేసేందుకు, ఐదేళ్లపాటు నీళ్లలో నానిన ఐకానిక్ టవర్ల పునాదుల పటిష్ఠతను ఐఐటీ నిపుణులతో మదింపు చేయించడానికి మరింత సమయం పట్టింది. ఏతావాతా 8 నెలలు దానికే పోయింది. తర్వాత నాలుగు నెలల్లో చకచకా టెండర్లు పిలిచింది. రాజధానిలో ప్రభుత్వం చేయాల్సిన పనుల్ని 73 ప్యాకేజీలుగా విభజించింది. వాటిలో 65 పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది. జగన్ ప్రభుత్వ నిర్వాకంతో ఇప్పుడు మళ్లీ టెండర్లు పిలవాల్సి రావడంతో అంచనా వ్యయం 2025 శాతం పెరిగింది. అంటే రూ.15 వేల కోట్ల వరకు అదనపు భారం పడింది.

* **కేంద్రం అండదండలు**

రాజధాని నిర్మాణానికి ఈసారి కేంద్రం పూర్తిస్థాయిలో అండదండలు అందించడం సానుకూల పరిణామం. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో ఈసారి తెదేపా కీలకమైన భాగస్వామి కావడంతో... అమరావతికి అన్నివిధాలా అండగా ఉండేందుకు మోదీ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిందే తడవుగా అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రం చొరవ తీసుకుని ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15వేల కోట్లు ఇప్పించింది. దాన్ని రాష్ట్రానికి గ్రాంటుగా ఇస్తున్నామని, ఆ రుణాన్ని తామే తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. రాజధాని నిర్మాణానికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా మినహాయింపు ఇచ్చింది.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# తెలంగాణ క్రికెట్ కోసం అందరూ ఏకం కావాలి

*** టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి**



అంబర్ పేట, జూన్ 4, (సమయం న్యూస్) : వందేండ్లలో తొలిసారి 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చేందుకు ఐసీసీ, బీసీసీఐ విశేష కృషి చేయగా.. ఇక్కడ 90 ఏండ్లలో తెలంగాణ గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) చేసింది శూన్యమని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. హెచ్‌సీఏ సవతి తల్లి ప్రేమతో తెలంగాణ గ్రామీణ క్రికెట్ ఇప్పటికే ఎంతో నష్టపోయింది. గ్రామీణ క్రికెటర్ల భవిష్యత్ కోసం ఇకనైనా తెలంగాణలో క్రికెట్ సంఘాలు అన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 90 ఏండ్లలో 9 ఉమ్మడి జిల్లాల్లో క్రికెట్‌ను అభివృద్ధి చేయలేని హెచ్‌సీఏ ఇప్పుడు 33 జిల్లాల్లో క్రికెట్‌కు ఏం చేయగలుగుతుంది?. ఎటువంటి ప్రణాళిక, కార్యాచరణ లేకుండా హెచ్‌సీఏ జిల్లాల్లో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించి ప్రతిభావంతులైన గ్రామీణ క్రికెటర్లను వెలికి తీయలేకపోయింది. గ్రామీణ ఇటువంటి కంటితుడుపు శిక్షణ శిబిరాలను కోరుకోవటం లేదు. రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం న్యాయమైన వాటా దక్కాలని ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఏర్పడి పదేండ్లైనా ఇప్పటి వరకు కొత్త జిల్లాల్లో క్రికెట్ సంఘాల ఏర్పాటుకు అడుగు ముందుకేయని హెచ్‌సీఏ.. ఇక కొత్త జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధిని పట్టించుకునేందుకు ఇంకెన్ని దశాబ్దాలు కాలయాపన చేస్తుందని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. జిల్లా క్రికెటర్ల కోసం ఉచితంగా టోర్నమెంట్లు నిర్వహించటంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అలవాటు చేసేందుకు అమెరికా యూత్ క్రికెట్ జట్టుతోనూ వన్డే టోర్నమెంట్ నిర్వహించిన టీడీసీఏకు బీసీసీఐ గుర్తింపు ఇవ్వటంతోనే తెలంగాణ గ్రామీణ క్రికెట్ అభివృద్ధి సాధ్యమని, ఇందుకోసం గ్రామీణ క్రికెట్ కోసం కృషి చేస్తున్న సంఘాలు అన్నీ కలిసిరావాలని అల్లీపురం కోరారు.



# భూ బాధితులకు అండగా వుంటాం

*** మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి**

గుమ్మడిదల, జూన్ 4, సమయం న్యూస్ : మండల కేంద్రమైన గుమ్మడిదలలోని సర్వేనెంబర్ 109 భూ బాధితులకు అండగా వుంటామని మాజీ మంత్రి హరీష్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం బిఆర్ఎస్ యువ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఒక కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే లను గుమ్మడిదల సర్వే నెంబర్ 109 లోని భూ బాధితులు కలిశారు. వారికి తమ సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన హరీష్ రావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని, బాధితులకు పూర్తి పరిహారం అందే వరకు వుంటే వుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, నరసింహారెడ్డి, నరేందర్ రెడ్డి, కుమార్ గౌడ్, రాజశేఖర్, వెంకటేష్, మొగులయ్య, మంద భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.




# జిన్నారం మండల తహశీల్దార్ ను కలిసిన మాదారం గ్రామవాసులు

జిన్నారం, జూన్ 4, సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారం లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల తహసిల్దార్ దేవదాసు ను మాదారం గ్రామవాసులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తహసిల్దార్ ను శాలువాతో సన్మానించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాదారం మాజీ సర్పంచ్ సరితా సురేందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నాట్య మయూరి విభ శ్రీ

*** కూచిపూడి నృత్య కళాకారి నికి కలెక్టర్ అభినందనలు ...**



నిజామాబాద్ జూన్ 04 ,( సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా చిలకలూరి పేట కళా నిలయం లో జరిగిన 40 వ జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ సంగీత నాట్య కళారూపాల పోటీలలో పాల్గొని 10 సం,, వయసు లోపు కూచిపూడి నృత్య విభాగం లో " తరంగం " నృత్య ప్రదర్శన కు గాను "ప్రత్యేక జ్యూరీ నాట్య మయూరి అవార్డ్ " ఇందూరి జిల్లా వాసి అయిన తేలి విభ శ్రీ సొంతం చేసుకుంది. నగరం లోని శ్రీ కరణం శ్రీనివాస్ గారి నాట్య తరంగిణి కళాశాల లో ప్రత్యేక నృత్యం అభ్యసించింది. తరంగం ప్లేటు పై నిలబడి తల పై చెంబు తో " కృష్ణం కలయ సఖి " నృత్యాన్ని చేస్తూ ప్రేక్షకులను అబ్బుర పరుస్తూ కళా నిలయం చిలకలూరిపేట లో ప్రశంసలు పొందినది. చిన్నారి విభా శ్రీ ఇటు శాస్త్రీయ నృత్యాన్ని మరియు పాశ్చాత్య నృత్యాన్నీ రెండు కళ ల్ని ప్రోత్స హిస్తున్న తల్లి దండ్రులైనా (విజయ్ కుమార్ ప్రసన్న) కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రత్యేక అభినందనలు తెలిపినారు.

# విలేకరి పై దాడిని ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

**– ఎమ్మెస్సార్ బార్‌పై చర్యలకు డిమాండ్**

బోధన్ పట్టణం, జూన్ 4 సమయం న్యూస్ : బోధన్ పట్టణంలో రాజ్ న్యూస్ విలేకరి సయీద్‌పై జరిగిన దాడిని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌కు వినతిపత్రం అందజేసి, ఎమ్మెస్సార్ బార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బోధన్ నుండి రుద్రూర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎమ్మెస్సార్ బార్, నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న



విషయాన్ని మీడియా వెలుగులోకి తీసుకురాగా, ఈ దృశ్యాలను కవర్ చేస్తున్న విలేకరి సయీద్‌పై బార్ సిబ్బంది దాడికి పాల్పడ్డారు. అతని ఫోన్ లాక్కొని శారీరకంగా దాడి చేసినట్లు ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు మీడియా నాల్గవ స్తంభంగా ఉండి ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తుందని, విలేకరులపై దాడులు హేయమైన చర్యలు అని వ్యాఖ్యానించారు. ఎమ్మెస్సార్ బార్ ప్రధాన రహదారి పక్కన ఉండటం వలన అటుగా కంటి ఆసుపత్రికి వెళ్లే ప్రజలకు, అటునుండి పాఠశాల, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు అసౌకర్యాలు కలుగుతున్నాయని, బార్‌ను వెంటనే అక్కడి నుండి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎన్. రవిశంకర్ గౌడ్, ఎన్నారై అహ్మద్, అన్సార్, ఆసిమ్, మతిన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన జీహెచ్ఎంసీ 11వ సర్వ సభ్య సమావేశం

*** పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపిన సభ్యులు**







హైదరాబాద్, జూన్ 04(సమయం న్యూస్) నగర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ 11వ సాధారణ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో పాకిస్తాన్ టెర్రరిస్టులు అమాయక ప్రజలను పహల్గాం లో కిరాతకంగా చంపిన సంఘటనకు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దాడిలో మరణించిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సభ ప్రారంభానికి ముందు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ... జీహెచ్ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చిన మేరకు గౌరవ ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తూ బల్దియా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. నగర ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. నగరంలో ముందస్తు మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ వలన ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి గల్లీని పరిశుభ్రం చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి పరిశుభ్రమైన నగరంగా ఉండేందుకు దోహద పడుతుందని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు గౌ.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్లమెంటు సభ్యులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని అధికారులను కోరారు. నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించుటకు జోనల్ వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, ముందుగా ఎల్బీనగర్ జోన్ లో నిర్వహించి ఆ సమావేశంలో కార్పొరేటర్లు అడిగిన సమస్యల పరిష్కారం కోసం తగు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. మిగతా జోన్ లలో కూడా శానిటేషన్, డిసిల్టింగ్, నాలా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసేందుకు అధికారులతో కార్పొరేటర్లు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ వివరించారు. మొఘల్ పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ప్రభుత్వ కార్యాలయం ఉన్నందున క్రీడలకు అంతరాయం ఏర్పడుతుందని, క్రీడాకారులు తయారు కావడానికి కార్యాలయాన్ని వెంటనే అక్కడి నుండి తొలగించాలని సయ్యద్ సోహెల్ ఖాద్రీ కోరారు. ఈ విషయం పై కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ మెటీరియల్ ను, సమ్మర్ కోచింగ్ లో కాకుండా ముందస్తుగా ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను కూడా అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నందున యువత .... అంబర్ పేట్ కార్పొరేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ... అంబర్ పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో కోచ్ లేడని తెలిపారు. వనస్థలిపురం ప్రభుత్వ ప్లే గ్రౌండ్ లో ప్రైవేట్ వ్యక్తులు స్కేటింగ్ రుసుం వసూలు చేస్తున్నారని కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతంలో పేద వాళ్లు ఎక్కువగా ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్లను స్థానిక ప్రదేశంలో ఇవ్వాలని, దూర ప్రదేశంలో ఇవ్వవద్దని తెలిపారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు సరిగా లేవని తెలిపారు. అందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని తెలిపారు. నగరంలో ఏర్పడే కొత్త కాలనీలలో భవిష్యత్తు ప్రణాళికతో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎస్.ఎన్.డి.పి ద్వారా నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని, పార్కు స్థలాలను కాపాడాలని, జలమండలి, జీహెచ్ఎంసి సమన్వయంతో వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైల్వే లైన్ల ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి అండర్ పాస్ ల నిర్మాణానికి రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో కంట్రిబ్యూషన్ లేకుండా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. బొల్లారం వద్ద నిధులు మంజూరై ఇప్పటికి 20 ఏళ్లు అయినా ఇంకా ప్రారంభించలేదని అన్నారు. నగరంలో ఆఫీస్ లో కంటే ట్రాఫిక్ లో ఇబ్బందుల పడుతున్నారని తెలిపారు.

*** నగరంలోని ఫ్లైఓవర్లకు ఉర్దూ బాషలో బోర్డులు పెట్టాలి: ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్**

రాష్ట్రంలో రెండో అధికార భాష ఉర్దూ ఉన్నందున అధికారులు నగరంలోని కొన్ని ఫ్లైఓవర్లకు ఉర్దూ భాషలో పేర్లు పెట్టడంలేదని ఆయన తెలిపారు. వెంటనే ఫ్లైఓవర్లకు ఉర్దూ భాషలో పేర్లు పెట్టాలని ఆయన కోరారు. మొట్టమొదటి సారిగా సమావేశానికి అధ్యక్షత గా వ్యవహరించిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మొట్టమొదటి సారిగా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె బర్త్ అండ్ డెత్ అంశం పై సమర్థవంతంగా చర్చ నిర్వహించారు. సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు అధికారులతో సమాధానం ఇప్పించారు. టీ బ్రేక్ అనంతరం తిరిగి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షత వహించి సమావేశానికి కొనసాగించారు. ఈ సమావేశంలో జపాన్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమావేశం పూర్తయ్యే వరకు వారు సభ తీరును పరిశీలించారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, శానిటేషన్, బర్త్ అండ్ డెత్, వీధి లైట్లు, అడ్వర్టైజ్మెంట్, డిసిల్టింగ్ తదితర అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయా విభాగాల అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు విజయశాంతి, బల్మూరి వెంకట్, మిర్జా రియాజ్ ఉల్ హస్సన్ ఎఫెంది, మిర్జా రహమత్ బేగ్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు జుల్ఫికర్ అలీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమీషనర్లు స్నేహ శబరీష్, వేణుగోపాల్, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, సుభద్ర, మెయింటెనెన్స్ సి.ఇ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్ట్ సి.ఈ భాస్కర్ రెడ్డి, జోనల్ కమీషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, రవికిరణ్, వెంకన్న, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్, నల్లూర్,
# కిసాన్ నగర్ రెవెన్యూ సదస్సులలో పాల్గొన్న కలెక్టర్

*** రాజీవ్ గాంధీ హనుమంతు**




నిజామాబాద్ జూన్, 04 (సమయం న్యూస్) : నిజామాబాద్, జూన్ 04 : భూ భారతి రెవెన్యూ సదస్సులలో భాగంగా బుధవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్పల్లి మండలం మాదాపూర్, ముప్కాల్ మండలం నల్లూర్, కిసాన్ నగర్ గ్రామాలలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. సరిపడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఒకే దరఖాస్తులో రైతులు రెండు, మూడు రకాల భూ సమస్యలను పేర్కొనవచ్చని తెలిపారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్లైన్ లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 18 రాష్ట్రాలలో సమగ్ర అధ్యయనం జరిపి, నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సమయపాలన పాటిస్తూ, అర్జీలు స్వీకరించాలని రెవెన్యూ బృందాలను ఆదేశించారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహశీల్దార్ కిరణ్మయి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భూభారతి సదస్సులో వినతుల వెల్లువ

*** జిన్నారం తహసిల్దార్ దేవాదాసు**

జిన్నారం, జూన్ 4 , సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలో నిర్వహిస్తున్న భూభారతి సదస్సుల కు మంచి స్పందన వస్తుందని, సమస్యలపై వినతులు ఇస్తున్నారని ,జిన్నారం మండల తహసిల్దార్ దేవదాసు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలో రెండవ రోజు అందూర్ ,బొల్లారం గ్రామాలలో భూభారతి సదస్సు నిర్వహించామని ఆయన తెలిపారు . అందూర్ గ్రామంలో నుండి 44 వినతులు ,బొల్లారం నుండి 42 వినతులు వచ్చాయని వారు పేర్కొన్నారు .ఇట్టి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని వారు పేర్కొన్నారు. మండలాల్లోని వివిధ గ్రామాల్లో జరిగే భూ భారతి సదస్సులను ప్రజలు సద్వినియోగపరుచుకోవాని ఆయన ఆకాంక్షించారు .

# బక్రీద్ పండగను ప్రశాంతమైన వాతావరణం లో జరుపుకోవాలని

## బోధన ఎసిపి శ్రీనివాసరావు





బోధన్. జూన్ 4. సమయం న్యూస్ : ఈరోజు అనగా 4 తారీకున బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో బోధన ఏసిపి శ్రీనివాస ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ మతసామరసంతో ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకోవాలని తెలిపారు. ఎవరో కూడా పండగ వాతావరణాన్ని కలుషితం చేయవద్దని. ఆయన కోరారు. బోధన మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ మాట్లాడుతూ పండగ సందర్భంగా పట్టణంలోని ఈద్గాల వద్ద ప్రజల అవసరార్థం తాగునీరు, ఈద్ గల వద్ద షామియాలను ఏర్పాటు చేశామని, అలాగే పండగ రోజున కుర్బానీ వచ్చే వేస్ట్ మెటీరియల్ ని వెంటనే తీసివేయడం కొరకు ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు మరియు ఇతర సౌకర్యాలు కల్పించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ హెచ్ ఓ వెంకటనారాయణ, టౌన్ ఎస్ ఐ హబీబ్ ఖాన్, మరియు బోధన పట్టణం ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



# వ్యవసాయ సాగు వ్యయాన్ని తగ్గించుకోండి

*** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయ శాస్త్రవేత్తలు**

గుమ్మడిదల ,జూన్ 4, సమయం న్యూస్ : వ్యవసాయ సాగు వ్యయాన్ని తగ్గించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తెలిపారు . ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం బుధవారం గుమ్మడిదల మండలం రాంరెడ్డి బావి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి హేమలత మాట్లాడుతూ, రైతులు విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు తీసుకునె బిల్లులు సీజన్ ముగిసే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. సాగు వ్యయాన్ని తగ్గించుకునే మార్గాలను రైతులకు వివరించారు.విత్తనాలను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా గాని, విశ్వవిద్యాలయం ద్వారా గాని కొనుగోలు చేయాలని తెలిపారు. కొత్త రకపు వరి రకాలపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటలో పాల్ ఆర్మీ వార్మ్ నివారణ ,అడవి పందుల నిర్వహణ చర్యల గురించి రైతులకు శాస్త్రీయంగా వివరించారు. విత్తన శుద్ధికరణ లో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులు సమతూలిత ఆహారం తీసుకోవాలని వారు కోరారు. రోజువారి ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆరోగ్యమే మహాభాగ్యమని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రణవి, యూనివర్సిటీ పీహెచ్డీ విద్యార్థి హీమా కుమార్, డాక్టర్ సారిక, సుస్మిత ,గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా

# శ్రీ గురు పీఠం ప్రతిష్ట మహోత్సవ వేడుకలు.!

*** ముఖ్య అతిథులుగా వేద పండితులు మాజీ మంత్రిఎమ్మెల్యే హాజరు.!!**

శివంపేట్ జూన్ 4( సమయం న్యూస్): శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గురు పీఠంలో దేవత మూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం మూడు రోజుల లోభాగంగా రెండవ రోజు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్ద గోనిజిన్నారం శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులు ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మధ్య , గవ్యత పూజలు, మర్జనలు, వాస్తు పూజ, వాస్తు హోమము, వాస్తు బలి పర్యాగ్నికరణ, గ్రామ ప్రదక్షణ, లక్ష గోదారణ, జలాధివాసము, క్షీరాది వాసము, దాన్యాధివాసము, శాంతి కుంభ స్థాపనలు, మంట పరచిన, మూర్తి హోమం, శాంతి హోమ , దిశ హోమా , అంగపత్యంగా హోమములు పుష్పదివాసము , వస్త్రాధివాసము , పాలాదివాసము, హారతి మంత్రపుష్పము వంటి కార్యక్రమాలు వేద పండితుల మధ్య రెండవ రోజు పూజకార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో శ్రీ దత్తాత్రేయ స్వామి, మరియు శ్రీ సాయి బాబ దేవాలయమునకు వచ్చిన భక్తులకు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ రమాదేవి పుణ్య దంపతులు గురు పీఠం ట్రస్ట్ సభ్యుల సహకారంతో దర్శనమునకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్,నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ ఎంపీపీకల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్పిటిసి పబ్బ మహేశ్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమణ గౌడ్, జడ్పికో ఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు యాదవ్ గౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, కృష్ణారావు,సంతోష్





రెడ్డి, పవన్ గుప్తా, బిక్షపతి రెడ్డి, నరసింహారెడ్డి, రాజ్యంబిక్షపతి యాదవ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# బోధన్ మండలంలో కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు

బోధన్ మండలం, జూన్ 4, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు సజావుగా కొనసాగుతున్నాయనీ బోధన్ మండల తహసిల్దార్ విట్టల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 3 నుండి 20వ తేదీ వరకు ప్రతి రోజు రెండు టీములుగా మండలంలోని వివిధ గ్రామాలలో ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈక్రమంలో బుధవారం బోధన్ మండలంలోని బండారుపల్లి, మావంది కూర్దు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివిధ సమస్యలను అధికారులకు వినిపించి, పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. బందర్ పల్లి గ్రామంలో మొత్తం 12 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు మాట్లాడుతూ, భూమి వివాదాలు, పత్రాల సవరణలు, పోటీ హక్కుల సమస్యలు వంటి అంశాలపై రైతులు రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. సంబంధిత గ్రామ ప్రజా ప్రతినిధులు రైతులకు ఈ సదస్సుల గురించి పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రైతుల నుండి మంచి స్పందన కనిపిస్తోంది.

## వర్షా కాలానికి ముందస్తుగా ఆహారాలబిదారులకు

# మూడు నెలల బియ్యం పంపిణీ కేంద్ర నిర్ణయం

*** బిజెపి పర్యవేక్షణ**

బోధన్ పట్టణం, జూన్ 4 సమయం న్యూస్ : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఆహార కొరత కు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రతా లబ్ధిదారులకు మూడు నెలల కు సరిపడా బియ్యాన్ని అందించాలని కీలక చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, జూన్ 1 నుండి 30 వరకు ప్రతి కుటుంబ సభ్యుడికి 6 కిలోల బియ్యం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేపట్టింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు వీటిని ప్రారంభించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ కార్యక్రమం చేపట్టగా ఇందులో 5





కిలోలు కేంద్ర ప్రభుత్వం అందించగా, మిగిలిన 1 కిలోను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. ఈ సమాచారాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని బోధన్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి గోపి కిషన్ రేషన్ డీలర్లకు సూచించారు. ప్రతి రేషన్ షాపులో మోదీ ఫోటోతో పాటు సమాచారం కలిగిన సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, లేకపోతే రేషన్ డీలర్ షిప్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మాసిన వినోద్ (చిన్న), రాజులదేవి పవన్ కుమార్, ఎనుగంటి గౌతమ్ గౌడ్, కస్ప లింగం, కలికోటే కృష్ణ, అడ్లూరి ఫణి, దుద్దెల విజయ్, బండారుపల్లి కిరణ్, గుడుమల శ్రీకాంత్, సికిందర్ సింగ్, రోహిత్ చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా

*** మంత్రి దామోదర్ రాజా నరసింహ.**

హైదరాబాద్ జూన్ 04(సమయం న్యూస్) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని సచివాలయంలో ప్రభుత్వ ఆసుపత్రులలో నిరంతరం విద్యుత్తు సరఫరాపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్ ల పనితీరు వాటి సామర్థ్యం పై చర్చించారు,



రాష్ట్రవ్యాప్తంగా జనరేటర్ సౌకర్యం లేని ఆసుపత్రులలో ఆటోమేటెడ్ జనరేటర్ లను సమకూర్చుకోవడానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులలో విద్యుత్ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ లను నియమించుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాల అవసరమైన అత్యవసర పరికరాలను, సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఆస్పత్రులలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి లలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా జిల్లా వైద్య శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. అనంతరం, సమీక్షలో భాగంగా వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధుల నిర్మూలన కు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లతో పాటు కోవిడ్ టెస్ట్ కిట్స్ లను, అవసరమైన మందులను కొనుగోలు చేయాలని TGMSIDC అధికారులను మంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకొని శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

# రైతుబంధు , రైతు బీమా కొనసాగించాలని డిమాండ్

* వేములవాడ గోవులను రక్షించడంలో ప్రభుత్వం విఫలం
* రైతులకు బాకీ పడ్డ రైతుబంధు వెంటనే విడుదల చేయాలి
* మానసిక రోగులకు అన్నం పెట్టలేని దుస్థితి
* అందాల పోటీలో ఉన్న శ్రద్ధ రైతుల పైన లేదు
* మాజీ మంత్రి హరీష్ రావు



నర్సాపూర్ మే 4, (సమయం న్యూస్): నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తమదైన శైలిలో తీవ్రంగా విమర్శించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా చేస్తే రేవంత్ రెడ్డి మాత్రం అబద్దాలు ఆడటంలో రాష్ట్రం ను అగ్రగామిగా నిలబెట్టారని వంద రోజులలో 6 గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఆ 6గ్యారంటీలకు చట్టబద్ధత కూడా లేదు అని అన్నారు. రైతు ప్రభుత్వం అంటూ రైతుల కష్టాలను పట్టించుకునే నాథుడే లేడు వరి కొనుగోలు కేంద్రాలు సక్రమంగా జరగకపోవడం, వర్షాల వలన ధాన్యం మొలకెత్తి రైతులు నష్టపోయారని వడ్ల కుప్పల పైన రైతులు పిట్టల రాలిపోతుంటే కనీసం పరామర్శించలేరని. ఈ సంవత్సరం యాసంగి పంటలో ఇప్పటికి ఒక్క రూపాయి కూడా బోనస్ ఇవ్వలేరని సన్న వడ్ల కు ప్రకటించిన బోనస్ మెత్తం 1100 వందల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు బంధు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మూడు పంటల ఎకరానికి 18 వేల రూపాయలు ఇంకా బకాయి ఉన్నాయని వెంటనే కేబినెట్ నిర్ణయం తీసుకొని రైతుబంధు విడుదల చేయాలని రైతుబంధు పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతులకు జనము ,జిలుగు విత్తనాలు సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ విత్తనాల ధరలు పెంచారని రైతులకు సరిపడ విత్తనాలు అందించడంలో వడ్లు కొనుగోలు , రైతుబంధు, రైతు భీమా,పంటల భీమా, అంటూ రైతులను మోసం చెయడమే తప్ప చేసింది ఏమీ లేదు అని అన్నారు బీ ఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు రైతు బంధు, రైతు బీమా ,విత్తనాలు ఏనాడు ఆగలేవు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు, అందాల పోటీల కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తాయి కానీ రైతులకు బిల్లులు మాత్రం రావు అని అందాల పోటీలో ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని ఎద్దేవ చేశారు. శాసనసభ మూడు అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్ సమావేశంలో చెప్పిన మాటలు కూడా అమలు చేయక రైతుల నుండి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అసెంబ్లీలో చెప్పిన విధంగా ఈ వానాకాలంలో పంటల బీమా పథకం అమలు చేయాలని టిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. రేషన్ కార్డులు ఇస్తాం అంటూ సంవత్సరం పాటు ఊరిస్తున్నారు తప్ప ఇప్పటికి ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వ లేరని వేములవాడ రాజరాజేశ్వరి దేవాలయం అంటే భారత దేశ దక్షణ కాశీగా ప్రసిద్ధి చెందిందని భక్తులు సమర్పించిన కోడెలు వారానికి 20 నుంచి 26 కోడెలు మరణిస్తున్నాయని దేవాలయంలో కోడెలు మరణించడం రాష్ట్రానికి ఆ శుభం కలుగుతుందని రాష్ట్రానికి అశుభం జరిగితే ప్రజలకు అశుభం జరుగుతుందని కనీసం కోడెలను కాపాడలేని అసమర్ధత ప్రభుత్వమని మీకు చేతకాకపోతే గోవుల సంరక్షణ కేంద్రాలను సంప్రదించి గోవులను కాపాడి బాధ్యత మేము తీసుకుంటామని అన్నారు హిందూ దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తూ హిందూ దేవుళ్ళ పైన ఓట్లు వేసుకుంటూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు అని అన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్ లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు పిల్లల భవిష్యత్తు అందకారం కాకుండా చూడాలని అన్నారు. ఎర్రగడ్డ హాస్పటల్లో మానసిక రోగులకు అన్నం పెట్టే చేతకాని ప్రభుత్వం అని కేటీఆర్ ,హరీష్ రావు ,టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కార్యకర్తల మీద సోషల్ మీడియా ప్రచారం చేసే వారి పైన కేసులు పెట్టడం తప్ప వేరే పని ఏమి లేదు అని అన్నారు. సంవత్సరం కాలం పాటు ఇప్పటికీ కూడా రీజనల్ రింగ్ రోడ్డు పని మొదలు కాలేదు. భూ నిర్వాసితులకు ఇప్పటివరకు కూడా డబ్బులు అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు అటు పంటలు పండించక ఇటు డబ్బులు రాక కొత్తపేట గ్రామానికి చెందిన కంచన పల్లి శేఖర్ అనే రైతు ఆత్మహత్య ప్రయత్నం చేశారు అని ఇలా ఎంతోమంది భూ నిర్వాసితులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.



## జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై గలమెత్తిన కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్

అంబర్ పేట, జూన్ 4 (సమయం న్యూస్) : జిహెచ్ఎంసి పాలకమండలి సమావేశంలో అంబర్ పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అంబర్ పెట్ మున్సిపల్ మైదానంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని,వెంటనే పలు క్రీడలకు కోచ్ లను నియమించాలని , మైదానంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయవలసిందిగా తెలియజేస్తూ, సెంట్రల్ పోలీస్ లైన్ ప్రహరి గోడ ఆనుకొని ఉన్న నాలా వెడల్పు పనులను పూర్తి చేయాలని, ఇప్పటికే పలువురు పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకపోవడంతో వారు సానుకూలంగా ఉన్నారని,ఈ విషయం పై జి హెచ్ ఎం సి ఉన్నతాధికారులు, మేయర్ వెంటనే దృష్టిసారించి నాలా వెడల్పు పనులను పూర్తి చేయాలని తెలియజేశారు.

## భూభారతి ద్వారా
# అన్ని మండలాల,గ్రామాల్లో ఈ నెల 20 వరకు సదస్సులు

* జిల్లా కలెక్టర్ విజయేంది బోయి

మహబూబ్ నగర్ జూన్ 04( సమయం న్యూస్) : భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం కోయిల్ కొండ మండలం చంద్రాస్ పల్లి గ్రామం లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించారు. రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనేలా అవగాహన కలిగించాలని అన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సులు షెడ్యూల్ గురించి విస్తృతంగా గ్రామాల్లో తెలియ చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు ,ప్రజలు భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు గ్రామాల్లో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులు అంద చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తు దారులకు ఏ విధంగా దరఖాస్తు పూరించాలి సూచనలు,సలహాలు అంద చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులు నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం చంద్రాస్ పల్లి గ్రామంలో పల్లె దవాఖాన ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖాన లో పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నవి అని డాక్టర్,సిబ్బందిని అడిగారు. ఐదు గ్రామాలు ఉన్నాయని తెలిపారు. గర్భిణీ లు ఎంత మంది నమోదు అయ్యారు, ఎంత మంది డెలివరీ కి ఉన్నారు అని కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగారు. 33 మంది డెలివరీ ఉన్నారు. హై రిస్క్ కేసులు ఎన్ని ఉన్నాయి అని అడగగా 8 హై రిస్క్ కేసులు ఉన్నాయని కలెక్టర్ కు తెలిపారు. అన్ని డెలివరీలు



పక్కాగా డేటా సిద్ధంగా ఉంచాలని అన్నారు మే నెలలో ఎన్ని డెలివరీలో అయ్యాయి మే నెలలో 7 డెలివరీలు జరిగాయని తెలిపారు. గర్భిణీ మహిళలు, మాతా శిశు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాతా,శిశు సంరక్షణ,గర్భిణీ స్త్రీల చెకప్,హై రిస్క్ కేసుల చికిత్స తదితర అంశాలపై వారికి అవగాహన కలిగించాలి అన్నారు అదే విధంగా రక్త హీనత ఉన్న మహిళలకు కూడా ప్రత్యేక శ్రద్ధ కనపరచి చికిత్స అందించాలని అన్నారు. చిన్నపిల్లలకు టీకా లు వేసే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలి. డయాబెటిస్ పేషెంట్స్ ఎంతమంది ఉన్నారని అడిగింది డయాబెటి పేషెంట్స్ 78 మంది ఉన్నారు బీపీ పేషెంట్స్ 101 ఉన్నారు అని ఇంకా ఏమైనా ఇబ్బంది ఉందా మందుల కొరత ఏమైనా ఉందా అని తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ తో పాటు తహశీల్దార్,రెవెన్యూ,వైద్య సిబ్బంది ఉన్నారు.



## మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత ప్రచారం చేయాలి

: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్, జూన్ 04 ( సమయం న్యూస్) : నిర్మల్ జిల్లా మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మారే దిశగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందాలు మరింత ప్రభావవంతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాల నియంత్రణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ చట్టాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఏర్పాటు చేసిన ప్రగతిరథం ప్రజా చైతన్యం, ప్రచార రథయాత్ర వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల కారణంగా యువత భవిష్యత్తు అంధకారంలో నిత్యం నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 2న మాదకద్రవ్యాల రహిత నిర్మల్ జిల్లా స్థాపన కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను గ్రామస్థాయిలోనూ స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, వయోవృద్ధుల హక్కులు, బాల్యవివాహాల నివారణ, బాల కార్మిక నిషేధం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కళాకారులు సుదర్శన్, నాగరాజు, రఘునాథ్, లక్ష్మణ్, సుదర్శన్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ధరఖాస్తుల్లో అర్హులైన వారిని గుర్తించండి

– రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ.



సంగారెడ్డి జూన్ 04( సమయం న్యూస్) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. జిల్లా లో ఆరు గ్యారంటీల అమలు పై దృష్టి. సమగ్ర సమీక్ష సమావేశం - ప్రజా సంక్షేమ పథకాల అమలుపై స్పష్టమైన ఆదేశాలు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన ధరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వేగంగా, న్యాయంగా అందజేయాలని స్పష్టం చేశారు. ప్రతి ధరఖాస్తు ను నిర్లక్ష్యం చేయకుండా, అర్హతను పక్కాగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి...ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేకంగా చర్చించామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో అనవసరమైన జాప్యం జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా స్టీల్, సిమెంట్ వంటి నిర్మాణానికి అవసరమైన పరికరాలను నిర్ణీత ధరలకు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇసుక రీచ్‌లను మండల స్థాయిలో ఏర్పాటు చేయడం ద్వారా స్టీల్, సిమెంట్, సామగ్రి అందుబాటులో ఉండేలా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి భూమి లేని వారు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి సర్దుబాటు చేయదగిన ప్రభుత్వ భూమిని గుర్తించాలి అని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల విషయానికొస్తే, మహిళా సంఘాల ద్వారానే రుణాలను అందించాలన్న సూచన చేశారాయన. స్వయం సహాయక మహిళా సంఘాలు ఈ విషయంలో కీలకపాత్ర పోషించాలన్నారు. దీనివల్ల మహిళల ఆర్థిక స్వావలంబన పెరగడంతోపాటు, నిర్మాణం వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.



* ఆరు గ్యారంటీల అమలు పై దృష్టి..

ప్రభుత్వం ప్రజలకు హామీగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను నిష్పక్షపాతంగా, అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అమలు చేయాలని మంత్రి అన్నారు. ఈ గ్యారంటీలలో ముఖ్యమైన జీరో విద్యుత్ బిల్లు: విద్యుత్ వినియోగంలో నిర్దిష్ట పరిమితికి లోబడి వినియోగించిన కుటుంబాలకు విద్యుత్ బిల్లును మాఫీ చేయడం. ఈ ప్రయోజనం లబ్దిదారులకు నిరోధాలు లేకుండా అందించాలి. సబ్సిడీ గ్యాస్ పంపిణీ: మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, గ్యాస్ కనెక్షన్లపై రాయితీలను సమర్థవంతంగా అమలు చేయాలి. పేదలకు సన్నబియ్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాలకు రుణాలు స్వయం సహాయక సంఘాల కు రుణాల వితరణ వేగవంతం చేయాలని పేర్కొన్నారు.పక్కా ఇల్లు ప్రతి కుటుంబానికి ఉండాలన్న లక్ష్యంతో ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం యువతను సామాజికంగా, ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లే దిశగా ఉపాధి అవకాశా లు కల్పించాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం అర్హులైనవారికి వెంటనే సేవలు అందించాలన్నారు.




## సరసమైన ధరలకు స్టీల్ , సిమెంట్ సరఫరా చేయండి

* జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

మెదక్ జూన్04(సమయం న్యూస్ ): వినియోగదారులకు సరసమైన ధరలకు స్టీల్ సిమెంట్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శంకరంపేట మండల కేంద్రంలో ప్రైవేట్ స్టీల్ సిమెంట్ షాపును జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం మార్కెట్లో సిమెంట్ స్టీల్ ధరలు, నాణ్యత, వ్యాపార లావాదేవీలు మార్కెటింగ్ సంబంధిత విషయాలను షాప్ యజమాని నీ అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులను స్టీల్ సిమెంట్ మోసం చేసే విధంగా అధిక ధరలకు విక్రయాల జరపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మన్నన్ షాప్ యజమాని తదితరులు పాల్గొన్నారు.

# పాలకొండ నియోజకవర్గంలో శుభ పరిపాలనకు ఏడాది
# ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ








పాలకొండ పట్టణం: అరాచక పాలనకు ముగింపు వచ్చి సుపరిపాలన ప్రారంభమై ఏడాది పూర్తైన సందర్భంగా, రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వం గురించి హర్షం వ్యక్తం చేస్తూ కొనియాడుతున్నారు. ఈ శుభ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గారు,జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయితీలో గొల్ల వీధిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభను పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ గారు ఘనంగా నిర్వహించారు. సభలో మాట్లాడుతూ – "ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం మంచి పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నది. పాలకొండ నియోజకవర్గానికి నిధులు, అభివృద్ధి పనులు తీసుకువచ్చేందుకు నేను ఎప్పుడూ ముందుంటాను.ముఖ్యమంత్రి గారు మరియు ఉపముఖ్యమంత్రి గారు ఇచ్చిన మార్గదర్శకాలతో ప్రజలకు సేవ చేయడం మా ధ్యేయం." అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి మరియు మండల స్థాయి ఎన్డీఏ కూటమి సీనియర్ నాయకులు పాల్గొనడంతో పాటు,

# నృత్యంతో నిత్య యవ్వనం



**మారుతున్న జీవనశైలి.. యవ్వనంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. అందంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తున్నది. ఫలితంగా.. ముప్ఫై ఏళ్లకే ముఖ వర్చస్సు తగ్గిపోతున్నది. ముడతలు పడి 'ముదిమి'కి చేరువవుతున్నది. నలభైల్లోనే ఊబకాయంతో శరీరం ఫిట్‌నెస్ కోల్పోతున్నది. యాభై ఏళ్లు నిండకుండానే.. వృద్ధాప్యం స్వాగతం పలుకుతున్నది. అయితే.. ఈ సమస్యలన్నిటినీ ఒకేఒక్క 'డ్యాన్స్' తరిమేస్తుంది. రోజూ ఓ గంట నృత్యం చేస్తే.. నిత్య యవ్వనం మీ సొంతమవుతుంది. అందానికి అండగా నిలవడంతోపాటు శరీరాన్నీ షార్ప్‌గా మార్చేస్తుంది.**

* నృత్యంలో సెకండ్ల వ్యవధిలోనే ముఖ కవళికలు మారిపోతుంటాయి. అంటే.. ఫేషియల్ ఎక్సర్‌సైజ్‌లు పూర్తయినట్టే! దాంతో ముఖ కండరాలు బలంగా తయారవుతాయి. ముఖంపై గీతలు, ముడతలు తగ్గుముఖం పడతాయి. రక్త ప్రసరణతోపాటు ముఖవర్చస్సూ మెరుగవుతుంది.
* డ్యాన్స్‌తో జ్ఞాపకశక్తి పెరుగుతుందని 'ద న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' నిర్వహించిన అధ్యయనం తేల్చింది. కొన్నిరకాల ఏరోబిక్ డ్యాన్స్ వ్యాయామాలు.. మెదడులో జ్ఞాపకశక్తిని నియంత్రించే హిప్పోకాంపస్ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయట. ఫలితంగా, చిత్తవైకల్యం చిత్తవుతుంది.
* సంగీతానికి తగ్గట్టుగా చేసే నృత్యంతో ఒత్తిడి తగ్గుతుందని 'జర్నల్ ఆఫ్ అప్లయిడ్ జిరంటాలజీ' నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఉత్సాహంగా వేసే స్టెప్పులు.. నిరాశను తరిమికొడతాయి.
* శరీరంలో సెరటోనిన్ హార్మోన్ స్థాయులను పెంచుతాయి. ఇవి మనిషి మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. దాంతో, శరీరమే కాదు.. ఆలోచనలూ యవ్వనంగా మారుతాయి.
* డ్యాన్స్ చేస్తున్నంత సేపు శరీరం ఉల్లాసంగా ఊగిపోతుంది. ఫలితంగా ఫిట్‌నెస్ మరింత మెరుగుపడుతుంది. బరువు తగ్గడంతోపాటు శరీరం నాజూగ్గా తయారవుతుంది.
* వయసు మీద పడేకొద్దీ వేధించే సమస్య.. కీళ్ల నొప్పులు. నృత్యంతో ఈ సమస్యకు ఇట్టే చెక్ పడిపోతుంది.
* నృత్యం వల్ల శారీరక పనితీరు మెరుగుపడుతుందని 'ద స్కాలర్లీ పబ్లిషింగ్ అండ్ అకడమిక్ రిసోర్సెస్ కోయలిషన్' పరిశోధన వెల్లడించింది.

# పైసా వసూల్ నగలు...!

నోస్టాల్జియా ఎప్పుడూ బాగుంటుంది. అప్పుడలా ఉండేది, అప్పట్లో ఇలా చేసేవాళ్లం అంటూ చెప్పుకొనే కబుర్లూ ఎంతో బాగుంటాయి. మరి ఫ్యాషన్‌కీ నోస్టాల్జియా గుర్తొచ్చిందేమో... పాతకాలం నాణేలతో నగలు రూపొందించి, మనతో అప్పటి జ్ఞాపకాలు కలబోసుకునే ప్రయత్నం చేస్తున్నది. ఒక్క పైస, రెండు పైసలు, ఐదు పైసలు, పది పైసలు, పావలా... ఇలా మన దగ్గర కొన్నేళ్ల క్రితం వరకూ రకరకాల నాణేలు చలామణిలో ఉండేవి. తర్వాత తర్వాత అవి కనుమరుగై పోయాయి. వాటిని ఈ కొత్త జువెలరీ ట్రెండు మళ్లీ తెరమీదికి తెస్తున్నది. పైసా నుంచి పావలా దాకా రకరకాల నాణేలను పోగేసి వాటిని చెవిపోగులు, కమ్మలు, లాకెట్లు, గొలుసులుగా తీర్చిదిద్దుతున్నారు. పాత రూపాయి బిళ్లల్నీ ఇందులో చేరుస్తున్నారు. వీటిలో అచ్చంగా నాణేన్నే ఉంచి చేసేవి కొన్నయితే, దాని చుట్టూ



నగలకుండే నగిషీలు అద్ది వస్తున్నవి మరికొన్ని. ఎలా పెట్టుకున్నా సరే, చూడగానే చటుక్కున పాతస్మృతుల్ని తట్టి లేపే ఇవి కొత్త క్రేజ్‌గా మారుతున్నాయి. మరి వీటితో మీరూ కనెక్ట్ అయ్యారా?!







# లాబుబూ తెలుసా?

లాబుబూ... ఇప్పుడు ఎక్కడ చూసినా... ఇదే ట్రెండ్! బాలీవుడ్ నటి అనన్య పాండే సహా పలువురు హాలీవుడ్ తారలు దీనిపై మనసు పారేసుకున్నారు. కొంతమంది అయితే ఈ ట్రెండ్‌పై ఉన్న ప్రేమను పలు ఇంటర్వ్యూల్లోనూ పంచుకున్నారు. అసలేంటీ లాబుబూ అంటారా! ఇది ఒక బుల్లి మాన్‌స్టర్ బొమ్మ... ఆరు అంగుళాల పొడవు ఉండే దీన్ని హాంకాంగ్ కళాకారుడు తయారుచేశారు. చైనా సంస్కృతి ఆధారంగా... అక్కడి పురాణాలు, జానపద కథల సృజనాత్మకతను జోడించి రూపొందించారు. దీన్ని హ్యాండ్ బ్యాగులకు చార్మ్స్‌గా ఉపయోగిస్తున్నారంతా. ఇప్పుడు తారలూ మనసు పడటంతో వైరల్ అవుతోంది. మీకూ నచ్చాయా! ప్రయత్నించేయండి మరి.





# ఎర్రగడ్డ ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనపై ప్రభుత్వం సీరియస్

హైదరాబాద్: ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో కలుషితాహారం ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఆసుపత్రిలో ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిని తొలగిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఆర్ఎంవో డాక్టర్ పద్మజను సస్పెండ్ చేసింది. కలుషిత ఆహారం ఘటనలో ఒక రోగి మృతి చెందగా, 92 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు




వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత చెప్పారు.

## 1990లో సర్టిఫికెట్.. 35 ఏళ్ల తర్వాత ఎస్టీ కాదని కలెక్టర్ ఉత్తర్వులు

ఆదిలాబాద్: మాజీ ఎంపీటీసీ చవాన్ దేవానంద్ ఎస్టీ కాదని 35 ఏళ్ల తర్వాత కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేయడం స్థానికంగా సంచలనం రేపింది. ఇచ్చోడకు చెందిన ఆ నేత ఎస్టీ కులస్థుడు కాదంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1990లో దేవానంద్ ఎస్టీ సర్టిఫికెట్ పొందారు. ఆయన కుమార్తెలు ఈ రిజర్వేషన్‌తో 2 సార్లు సర్పంచిగా పోటీ చేసి గెలిచారు. 2014లో దేవానంద్ రిజర్వుడ్ స్థానంలో ఎంపీటీసీగా గెలిచారు. ఆయన కులంపై కమిషన్‌కు బంజారా సంఘం



నేతలు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో విచారణలో ఎస్టీ కాదని తేలడంతో అందుకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు.

## నోరున్న కార్పొరేటర్లకే నిధులిచ్చే పద్ధతి మారాలి

: ఎంపీ ఈటల

హైదరాబాద్: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగుతోంది. హైదరాబాద్ మహా నగరంలో సమస్య లపై కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు, మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులంతా కలిసి చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో వీధి దీపాలు, నాలాల విస్తరణ, వరదల విలయం, ట్రాఫిక్ ఇబ్బం దులు సహా పలు అంశాలపై ప్రశ్నలు, సమాధానాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భాజపా ఎంపీ ఈటల రాజేం దర్ మాట్లాడుతూ.. నగరంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నోరున్న కార్పొరేటర్లకే నిధులిచ్చే పద్ధతికాకుండా.. పార్టీలతో సంబంధం లేకుండా సమస్యలు ఉన్న అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం



కాంగ్రెస్ నేతలు మాట్లా డుతూ.. మూసీ పునరుజ్జీవంలో కేంద్రం సహకారానికి ఈటల కృషిచేయాలని అడగ్గా.. అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక ఆర్‌వీ కర్ణన్ తొలిసారి హాజరయ్యారు.



## కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నోటీసులను నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయనకు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. '' అది కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయట్లేదు. తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించట్లేదు. గోదావరి పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును అడ్డుకోవాలి. భాజపాలో ఉన్న తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లాడకపోవడం శోచనీయం. గోదావరి బనకచర్లను ఆపే బాధ్యతను ఆయన తీసుకోవాలి. కాళేశ్వరానికి జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలి'' అని కవిత అన్నారు.

## జూన్ 18 నుంచి తెలంగాణ టెట్ పరీక్షలు.. ఏ సబ్జెక్టు ఎప్పుడంటే?



తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. నోటిఫికేషన్‌లో జూన్ 15నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నప్పటికీ 18వ తేదీ నుంచి నిర్వహిస్తుండటం గమనార్హం. ఈ మేరకు తాజాగా పరీక్షల నిర్వహణ తేదీలు, సెషన్లు, సబ్జెక్టులు, జిల్లాల వివరాలతో పాఠశాల విద్యాశాఖ అధికారులు పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. జూన్ 9నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు (జూన్, డిసెంబర్) టెట్ పరీక్ష నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈసారి మాత్రం 1,83,653 దరఖాస్తులే వచ్చినట్లు అధికారులు తెలిపారు. పేపర్ 1కు 63,261మంది, పేపర్ 2కు 1,20,392మంది దరఖాస్తు చేసుకోగా.. రెండు పేపర్లకు దరఖాస్తు చేసినవారు 15వేల మంది వరకు ఉన్నట్లు పేర్కొన్నారు.



## చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి.. మంత్రి పొన్నం ప్రభాకర్

మృగశిర కార్తె సందర్భంగా ఈనెల 8వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఉబ్బస రోగులకు బత్తిన కుటుంబం చేపట్టనున్న చేప ప్రసాదం పంపిణీ కి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఇతర అధికారులతో కలిసి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేప ప్రసాదం పంపిణీ కి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఉబ్బస రోగుల కోసం 1.5 లక్షల చేప పిల్లలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అంతకుముందు చేప ప్రసా దం పంపిణీ లో బారికేడ్లు, క్యూ లైన్ లో ఇబ్బందులు, భద్రత ఏర్పాట్ల గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల ముందు నుండే రోగులు ఎగ్జిబిషన్ మైదానానికి వచ్చే అవకాశం ఉందని, అందరికీ త్రాగునీరు, వైద్య సౌకర్యం, ఏర్పాటు చేయాలన్నారు.

## అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు

: మంత్రి పొంగులేటి

అర్హులైన నిరుపేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తుంటే తాను భావోద్వేగానికి లోనయ్యానని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని అన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇండ్లపై పెట్టలేదని, పేద ప్రజల సొంతింటి కలను విస్మరించిందని అన్నారు. రూ. 22 వేల 500 కోట్ల రూపాయలను పేద ప్రజల సొంతింటి కల కోసం ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సరం కేటాయించిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం అజెండాగా పాలన కొనసాగిస్తున్నామని



అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతి రూపాయి పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత పాలకులు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, గురుకులాల్లో డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు దాదాపు రూ. 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతు భరోసా పథకం క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి రూ. 12 వేల రూపాయలకు పెంచామని అన్నారు. ప్రస్తుతం ప్రజలకు అందించే ఇండ్లు మొదటి విడత మాత్రమేనని, ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఉంటుందని, ఏదులాపురం మున్సిపాలిటీ లో ప్రస్తుతం 520 మందికి ఇల్లులు మంజూరు చేసినట్లు, ఇంకా అర్హులున్నారని, వారికి కూడా ఇస్తామని, నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని మంత్రి తెలిపారు.

## భాజపా నేత, మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి కన్నుమూత

హైదరాబాద్: భాజపా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. గత కొంతకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఇవాళ తుదిశ్వాస విడిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా చేసిన రంగారెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. కిరణ్ కుమార్‌రెడ్డి భాజపాలో చేరిన తర్వాత మాగం రంగారెడ్డి కూడా అదే పార్టీలో చేరారు. మాగం మృతి పట్ల కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, డీకే అరుణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం శామీర్ పేటలో రంగారెడ్డి అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
www.samayamdaily.net



# ఆర్సీబీ జట్టుకు సన్మానం చేసిన కర్ణాటక ప్రభుత్వం

**తొలిసారిగా ఐపీఎల్ (IPL) టైటిల్ సాధించిన బెంగళూరు జట్టుకు కర్ణాటక విధాన సౌధలో ప్రభుత్వం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్సీబీ ఆటగాళ్లను సత్కరించారు.**













## డిసెంబరు 5న రాజాసాబ్



ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఎట్టకేలకి విడుదల తేదీని ఖరారు చేసుకుంది. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా నిర్మాణ సంస్థ ప్రకటించింది. టీజర్‌ని ఈ నెల 16న విడుదల చేయనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. మంగళవారం ప్రత్యేకమైన ఓ పోస్టర్‌తోపాటు, సినిమా, టీజర్ విడుదల వివరాల్ని ప్రకటించింది నిర్మాణ సంస్థ. ''భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ గొప్ప అనుభూతిని పంచుతుంద''ని సినీవర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కార్తీక్ పళని, సంగీతం: తమన్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్.



> జాన్వీ కపూర్ డెనిమ్ లుక్ ఐకానిక్ తెలుగు క్లాసిక్‌కు నివాళి అర్పించింది. ఇటీవల, జాన్వీ కపూర్ నటులు ఇషాన్ ఖట్టర్ మరియు విశాల్ జెత్వాతో కలిసి కేన్స్ 2025 లో వారి హోమ్‌బౌండ్ చిత్రం ప్రీమియర్‌లో పాల్గొన్నారు.

# సినిమా

## ఎందుకు తగ్గింది!



సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ సరసన 'స్పిరిట్' సినిమాలో నటించే అవకాశాన్ని దీపికా పదుకొణె కోల్పోయిన విషయం తెలిసిందే. రూ. 20 కోట్ల రెమ్యునరేషన్, 15% షేర్ డిమాండ్స్‌ను వంగా తిరస్కరించడంతో ఈ ప్రాజెక్ట్ నుంచి ఆమె తప్పుకుందని సమాచారం. తాజాగా అట్లీ డైరెక్షన్‌లో రూ.800 కోట్ల బడ్జెట్ తో అల్లు అర్జున్ హీరోగా సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా ఏఏ22. ఇది టాలీవుడ్‌లో భారీ హైప్ ను సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం ఆమె రెమ్యునరేషన్ గురించి సస్పెన్స్ నెలకొంది. లేటెస్ట్ బజ్ ప్రకారం, దీపికాకు ఈ సినిమాలో ఎలాంటి షేర్ ఇవ్వడం లేదని, ఆమె కల్కి సినిమాకు తీసుకున్న రెమ్యునరేషన్‌నే ఈ సినిమాకు కూడా తీసుకుంటుందని తెలుస్తోంది. కల్కి కోసం ఆమె రూ. 15 కోట్లు + జీఎస్టీ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ రెమ్యునరేషన్ విషయంలో ఆమె ఎందుకు తగ్గిందని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. బహుశా స్పిరిట్ డేట్స్ కంటే ఏఏ22 సినిమా డేట్స్ తక్కువ అడిగి ఉంటారనే కామెంట్స్ వస్తున్నాయి. అలాగే ఆమె డిమాండ్స్‌లో కొన్నింటికి ఓకే చెప్పి ఉండవచ్చనేది మరో వాదన.



## ప్రభాస్@ 30 మినిట్స్

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప. భారీ బడ్జెట్ తో రూపుదిద్దుకుంటున్న ఈ పాన్ ఇండియా మూవీ ప్రమోషన్లు జోరుగా సాగుతున్నాయి. ఈ చిత్రంలో పాన్ ఇండియా లెవెల్లో అనేకమంది బిగ్ స్టార్స్ కూడా ఉన్నారు. మరి వారిలో రెబల్ స్టార్ ప్రభాస్ కూడా ఒకరు కాగా తాను ఈ సినిమాలో సుమారు 30 నిమిషాల మేర కనిపించనున్నట్టుగా టాక్ ఉంది. ఈ మూవీ కోసం ఆల్రెడీ సాలిడ్ ప్రమోషన్స్ ని మేకర్స్ అండ్ టీం చేస్తుండగా మంచు విష్ణు కూడా అగ్రెసివ్ గా ప్రమోషన్స్ ని చేస్తున్నాడు. ప్రమోషన్స్ లోనే తమ సినిమా రిలీజ్ పై మాత్రం తుది క్లారిటీ ఇచ్చాడు. తన సినిమా ఎట్టి పరిస్థితుల్లో ఈ జూన్ 27నే వస్తుంది అని కన్ఫర్మ్ చేసేశాడు. ఏపీ, తెలంగాణలో ఆల్రెడీ భారీ ఈవెంట్స్ ని తాను ప్లాన్ చేసుకున్నానని అంటున్నాడు.

## మాస్ మహరాజాతో ఆషికా





మాస్ మహరాజా రవితేజ నటిస్తున్న సినిమా మాస్ జాతర. ఈ సినిమా భాను బోగవరపు దర్శకత్వంలో వస్తోంది. ఈ మూవీని సమ్మర్ లో రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రవితేజ డైరెక్టర్ కిషోర్ తిరుమలతో ఓ మూవీ కమిట్ అయ్యారు. అయితే ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించడంతో, ఇప్పుడు మన టాలీవుడ్ దర్శక రచయితలు అదే జోనర్ లో సినిమాలు చేయాలని ట్రై చేస్తున్నారట. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే కథలు రాసుకుంటున్నారని తెలుస్తోంది. సరిగ్గా ఇలాంటి సినిమానే రవితేజ హీరోగా తీసేందుకు రెడీ అవుతున్నారు. ఈ మూవీ కోసం హీరోయిన్‌ల వేట మొదలు పెట్టారు. ఇప్పటికే కేతికా శర్మను సెలెక్ట్ చేయగా, ఇప్పుడు ఈ సినిమాలో మరో బ్యూటీ కూడా నటిస్తుందని సమాచారం. ఈ సినిమాలో రెండో హీరోయిన్‌గా ఆషికా రంగనాథ్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'నా సామిరంగ' తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి, మొదటి మూవీతోనే తన అందం నటనతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది కన్నడ భామ. ప్రస్తుతం 'విశ్వంభర' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఇప్పుడు మాస్ రాజా రవితేజతో యాక్టింగ్ చేసేందుకు సై అంటోంది భామ.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.